నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

గౌలా నదిలో వరద ఉధృతి.. పూర్తిగా ధ్వంసమైన రైల్వేట్రాక్..

డెహ్రాడూన్, అక్టోబర్ 19:: ఉత్తరాఖండ్‌లో వరుణ ప్రతాపం కొనసాగుతున్నది. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దాంతో నదులన్నీ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వరదలకు పలుచోట్ల వంతెనలు, రహదారులు, రైల్వేట్రాక్‌లు ధ్వంసమవుతున్నాయి. గౌలా నది వరద ఉధృతికి ఈ ఉదయం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ వద్ద కత్గోడామ్-ఢిల్లీ రైల్వే లైన్ దెబ్బతిన్నది.

ట్రాక్ కింద మట్టి, కంకర పూర్తిగా కొట్టుకుపోయాయి. దాంతో రైల్వేట్రాక్ పూర్తిగా ధ్వంసమైంది. ట్రాక్ ధ్వంసం కావడంతో అధికారులు ఆ మార్గం గుండా వెళ్లే రైళ్ల రాకపోకలను నిలిపేశారు.

హైదరాబాద్ | బుధవారం 20-10-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 71 | పేజీలు:4 | వెల: రూ.1/-

టీఆర్ఎస్ ప్లీనరీకి మాదాపూర్ హై టెక్స్‌లో ఘనంగా ఏర్పాట్లు

హైదరాబాద్ , అక్టోబర్ 19: టీఆర్ఎస్ పార్టీ ద్వి దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈ నెల 25న పార్టీ అధినేత ఎన్నిక కోసం నిర్వహించే ప్లీనరీ సమావేశం ఏర్పాట్లపై ప్లీనరీ ఆహ్వాన కమిటీ సభ్యులు మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికేపూడి గాంధీ మంగళవారం సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్లీనరీకి వచ్చే ప్రజా ప్రతినిధులు, నాయకులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. నిర్ణీత కాలానికి ముందే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని సంబంధిత ఇంచార్జీ లకు సూచించారు.

అలాగే అధికారులు, పోలీసుల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్ కుమార్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, రోజా రంగారావు, ట్రాఫిక్ డీసీపీ విజయ్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారీ శబ్దాలు వచ్చే బైక్ సైలెన్సర్లను తొలగించి.. రోడ్ రోలర్‌తో తొక్కించిన పోలీసులు

హైదరాబాద్ , అక్టోబర్ 19: ద్విచక్ర వాహనాల సైలెన్సర్లలో మార్పులు చేసి.. శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న వాహనదారులపై సిటీ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎక్కువ శబ్దం చేస్తున్న సైలెన్సర్లను వాహనాల నుంచి తొలగించి.. రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. నగరంలో అధిక శబ్దాలు చేస్తున్న సుమారు వెయ్యి వాహనాల సైలెన్సర్లను పోలీసులు స్వాధీనం చేసుకొని, వాహనదారులకు జరిమానాలు విధించారు. కేబీఆర్ పార్క్ వద్ద బైక్ మెకానిక్‌లు, ఆటో మొబైల్ దుకాణాల యజమానులకు సౌండ్ పొల్యూషన్, ఎయిర్ పొల్యూషన్‌పై అవగాహన కల్పించారు.

ఎక్కువ శబ్దాలతో వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిటీ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ హెచ్చరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 12,938 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సైలెన్సర్లు అమ్మే వ్యాపారులకు సైతం పోలీసులు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అతిగా శబ్దం చేసే సైలెన్సర్లతో వాహనదారులు పట్టుబడితే తొలిసారి రూ.వెయ్యి జరిమానా విధిస్తామని, రెండోసారి పట్టుబడితే రూ.2వేలు జరిమానా విధించనున్నట్లు చెప్పారు. వరుసగా ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

వాహనానికి సంబంధించిన హారన్ సౌండ్, సైలెన్సర్ ఎలా ఉండాలని అని రీసెర్చ్ చేసిన తర్వాత కంపెనీలు బైక్‌లను తయారు చేస్తారన్నారు. సౌండ్ పొల్యూషన్ చేస్తూ రోడ్లపై యువకులు బైక్ రేసింగ్ పాల్పడుతున్నారని, రోడ్లపై వెళ్లే వారికి సౌండ్ పొల్యూషన్‌తో అనారోగ్యానికి గురవడంతో పాటు గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. మెట్రో నగరం ఇమేజ్‌ను ఏమాత్రం తగ్గకుండా అందరూ శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగస్వాములు కావాలన్నారు.

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న సీఎం కేసీఆర్

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 19: : యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం దర్శించుకున్నారు. బాలాలయంలో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు నాయకులను వేద పండితులు ఆశీర్వదించారు.

సీఎం కేసీఆర్ వెంట దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, మండలి మాజీ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గ్యాదరి కిశోర్, పైళ్ల శేఖర్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులుతో పాటు పలువురు ఉన్నారు.

మంగళవారం మధ్యాహ్నం యాదాద్రికి చేరుకున్న సీఎం కేసీఆర్.. ఏరియల్ వ్యూ ద్వారా ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆ తర్వాత కాన్వాయ్‌లో ఘాట్ రోడ్డు ద్వారా కొండపైకి చేరుకున్నారు. పూర్తికావస్తున్న పుణ్యక్షేత్రం పునర్నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆలయ పునఃప్రారంభ ముహూర్తాన్ని సీఎం ప్రకటిస్తారు. ఆలయ పునఃప్రారంభ ముహూర్తాన్ని ఇప్పటికే చినజీయర్‌స్వామి ఖరారు చేశారు. ఆ వివరాలను మధ్యాహ్నం 3:30 గంటలకు మీడియాకు సీఎం తెలియజేస్తారు.

ఉప్పొంగిన నైనిటాల్ సరస్సు.. ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం

డెహ్రాడూన్: భారీ వర్షాలతో ఉత్తరాఖండ్ వణికిపోతోంది. ఆ రాష్ట్రంలో ఉన్న నదులన్నీ ఉప్పొంగిపోతున్నాయి. ఇక నైనిటాల్‌లో ఉన్న నైని సరస్సు కూడా ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఆ సరస్సు నుంచి నీరు .. నగర వీధుల్లో ప్రవహిస్తోంది. పట్టణంలో ఉన్న బిల్డింగ్‌లు, ఇండ్లల్లోకి నీరు వచ్చి చేరుతోంది. గత కొన్ని రోజుల నుంచి ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. నైనిటాల్‌లో ఫేమస్ ప్రాంతమైన మాల్ రోడ్డు.. సరస్సు నీటితో నిండిపోయింది. గత 24 గంటల నుంచి నైనిటాల్‌లో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. మోకాళ్ల లోతు మేర నీరు ఇండ్లల్లోకి చేరుకుంటోంది.

నైనిటాల్, రాణిఖేట్, అల్మోరా, హల్ద్వాణి, కాత్‌గోదమ్‌కు వెళ్లే అన్ని జాతీయ రహదారులు బ్లాక్ అయ్యాయి. నిరాటంకంగా కురుస్తున్న వానల వల్ల ఉత్తరాఖండ్‌లో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. రిషికేశ్‌లో తపోవన్ బ్రిడ్జ్, లక్ష్మణ్ జూలా, ముని కీ రేతి, భద్రకాలి వంతనల నుంచి వాహనాలను వెళ్లనివ్వడం లేదు. అయితే వాతావరణం మళ్లీ కుదుటపడేవరకు చార్‌ధామ్ యాత్రికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ఇప్పటికే అధికారులు సూచన చేశారు. ప్రస్తుతం హిమాలయాల్లో ఉన్న నాలుగు పుణ్య క్షేత్రాల్లో పూజలు యథావిధిగా కొనసాగుతున్నాయని, అక్కడ ఉన్న యాత్రికులు కూడా క్షేమంగా ఉన్నట్లు దేవస్థానం బోర్డు అధికారులు తెలిపారు.

అయిదుగురు మృతి

ఉత్తరాఖండ్ లో కొనసాగుతున్న వర్షాల వల్ల అయిదుగురు మృతిచెందినట్లు తెలుస్తోంది. దాంట్లో ముగ్గురు నేపాలీ కార్మికులు ఉన్నారు. కొండచరియలు విరిగిపడడం వల్ల ఆ ముగ్గురు శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ఇక చంపావత్‌లో ఓ ఇళ్లు కూలడం వల్ల మరో ఇద్దరు మృతిచెందారు.

రామ్‌నగర్-రాణికేట్ రూట్‌లో ఉన్న లెమన్ ట్రీ రిసార్ట్‌లో చిక్కుకున్న వంద మంది టూరిస్టులను సురక్షితంగా ఉన్నట్లు ఉత్తరాఖండ్ డీజీపీ అశోక్ కుమార్ తెలిపారు.

అందరూ సురక్షితంగా ఉన్నారని, వారిని రెస్క్యూ చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఉప్పొంగుతున్న కోశి నదిలోని నీరు ఆ రిసార్ట్‌లోకి ప్రవేశించినట్లు ఆయన చెప్పారు. దాంతో ఆ రిసార్ట్‌లోకి వెళ్లడం ఇబ్బందిగా మారిందన్నారు. నైనిటాల్ జిల్లాలోని రామ్‌ఘర్ గ్రామంలో కుంభవృష్టి కురిసింది. దీంతో అక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు, అధికారులు ఆ ప్రాంతంలో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు అందాల్సి ఉన్నది. హల్ద్వానీలో గౌలా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అక్కడ ఓ బ్రిడ్జ్ కొట్టుకుపోయింది. అయితే బ్రిడ్జ్ తెగిపోతున్న సమయంలో.. దానిపై ఉన్న వస్తున్న ఓ బైకర్‌ను స్థానికులు కాపాడారు. బ్రిడ్జ్ దాటుతున్న అతన్ని రావద్దు అంటూ మరో వైపు ఉన్న వాళ్లు ఆదేశించారు. నీటి స్థాయి పెరగడంతో క్రమంగా బ్రిడ్జ్ కొట్టుకుపోయింది. మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తి దూరంగా నిలిచిపోవడంతో ప్రాణాలు దక్కించుకున్నాడు.

వచ్చేవారంలో ఢిల్లీలో మరింత పెరుగనున్న వాయు కాలుష్యం!

న్యూఢిల్లీ, అక్టోబర్ 19:దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణ కాలుష్యం పెరిగింది. దీంతో ఢిల్లీ- ఎన్‌సీఆర్ పరిధిలో ఆందోళన వ్యక్తమవుతోంది. వచ్చే వారంలో కాలుష్యం మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారు. ఈ క్రమంలో కాలుష్యం నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (అంఖీఓ) స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాల కాల్చివేతతో జాతీయ రాజధానిలో వాయు కాలుష్యం పెరుగుతోందని ఢిల్లీ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.

వాతావరణ శాఖ అంచనాల మేరకు.. ఈ నెల 21-24 మధ్య ఢిల్లీలో పూర్ కేటగిరి నుంచి మితమైన స్థాయికి చేరుకుంటుందని కమిటీ అభిప్రాయపడింది. ఈ క్రమంలో కొన్ని కఠిన చర్యలు తీసుకోవాలని, వ్యర్థాలను కాల్చివేయడం ఆపాలని, ఆదేశాలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధించాలని పేర్కొంది. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో పరిస్థితి మెరుగయ్యే వరకు ఇటుక బట్టీలను మూసివేయడంతో పాటు బాణాసంచాపై సుప్రీం కోర్టు, ఎన్‌టీజీ ఆదేశాలు ఖచ్చితంగా పాటించేలా చూడడం, కాలుష్యానికి కారణమయ్యే వాహనాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో కాలుష్యం నివారణకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ రూపొందించగా.. గత కొన్ని రోజులుగా ఢిల్లీ, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, ఎన్‌సీఆర్‌లోని అన్ని నగరాల్లో వాయుకాలుష్యం కొనసాగుతున్నది. సోమవారం వర్షం కారణంగా కాస్త.. ఇది తాత్కాలిక ఉపశమనమేనని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాలను నిలిపివేసే ప్రచారాన్ని ప్రారంభించారు. కాలుష్య నియంత్రణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని పిలుపునిచ్చారు.

టీఆర్ఎస్ విజయగర్జన సభాస్థలిని పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , అక్టోబర్ 19: టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి రెండు దశాబ్దాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా..నవంబర్ 15న వరంగల్‌లో విజయ గర్జన సభ నిర్వహించనుంది. నగర సమీపంలో భారీ ఎత్తున సభను నిర్వహించి విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు శ్రీకారం చుట్టాయి.

అందులో భాగంగా నగరంలో శాయంపేట, భట్టుపల్లి, కరీమాబాద్, తిమ్మాపురం శివార్లలోని ఖాళీ స్థలాలను ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం పరిశీలించారు.

10 లక్షల మందితో భారీ ఎత్తున సభను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎలాంటి అటంకాలు కలుగకుండా అన్ని హంగులతో సభ విజయవంతం కావడానికి అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ స్థాపించి 20 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ సాధించిన విజయాలను, ప్రభుత్వం సాధించిన ప్రగతిని సీఎం కేసీఆర్ పార్టీ శ్రేణులు, ప్రజలకు నివేదిస్తారని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.

నేడు ఉత్తర్ ప్రదేశ్‌ను సందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 19:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 అక్టోబర్ 20న ఉత్తర్ ప్రదేశ్ ను సందర్శించనున్నారు. కుశీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఉదయం సుమారు 10 గంటల కు ప్రధాన మంత్రి ప్రారంభిస్తారు. ఆ తరువాత, అభిధమ్మ దినాని కి సూచకం గా మహాపరినిర్వాణ మందిరం లో దాదాపు గా పదకొండున్నర గంటల వేళ కు నిర్వహించేటటువంటి ఒక కార్యక్రమం లో ఆయన పాలుపంచుకొంటారు. అనంతరం, కుశీనగర్ లో వేరు వేరు అభివృద్ధి పథకాల లో కొన్నిటి కి ప్రారంభోత్సవం తో పాటు మరికొన్నిటి కి శంకుస్థాపన నిమిత్తం ఒంటిగంట పదిహేను నిమిషాల కు నిర్వహించే ఒక సార్వజనిక కార్యక్రమానికి ప్రధాన మంత్రి హాజరు అవుతారు.

కుశీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం

కుశీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభ సూచకం గా శ్రీ లంక లోని కొలంబో నుంచి వచ్చే ఒక విమానం ఈ విమానాశ్రయం లో దిగుతుంది. ఆ విమానం లో శ్రీ లం క కు చెందిన ఒక ప్రతినిధివర్గం భారతదేశం సందర్శన కు తరలివస్తుంది. వంద మంది కి పైగా బౌద్ధ భిక్షువులు, ప్రముఖులు ఆ ప్రతినిధివర్గం లో ఉంటారు. వారి లో 12 మంది సభ్యుల తో కూడిన పవిత్ర స్మృతి చిహ్న దళం కూడా భాగం గా ఉంటుంది.

వారు ప్రదర్శన కై బుద్ధుని పవిత్ర స్మృతి చిహ్నాన్ని వారి వెంట తీసుకు రానున్నారు. ప్రతినిధివర్గం లో శ్రీ లంక లోని బౌద్ధ ధర్మపు నాలుగు నికాతలు (శాఖలు) అయిన అసగిరియా, అమర్ పురా, రామన్యా, మాల్ వట్టా యొక్క అనునాయక్ ల (ఉప ప్రముఖుల) తో పాటు కేబినెట్ మంత్రి శ్రీ నమల్ రాజపక్షె నాయకత్వం లో శ్రీ లంక ప్రభుత్వం లోని అయిదుగురు మంత్రులు కూడా కలసి ఉంటారు.

కుశీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 260 కోట్ల రూపాయల అంచనా వ్యయం తో నిర్మించడం జరిగింది. దేశీయ తీర్థయాత్రికులు, అంతర్జాతీయ తీర్థయాత్రికులు భగవాన్ బుద్ధుని మహాపరినిర్వాణ స్థలానికి చేరుకొనే సౌకర్యాన్ని ఈ విమానాశ్రయం అందిస్తుంది. ఈ విమానాశ్రయం ప్రపంచం అంతటా నెలకొన్న బౌద్ధ తీర్థస్థలాల ను కలిపేందుకు చేసినటువంటి ఒక ప్రయాస గా కూడా ఉంది. ఇది ఉత్తర్ ప్రదేశ్ మరియు బిహార్ లలోని చుట్టుపక్కల జిల్లాల కు విమాన పర్యటన సౌకర్యాన్ని కలుగజేస్తుంది. విమానాశ్రయం నిర్మాణం ఈ రంగం లో పెట్టుబడి అవకాశాల ను మరియు ఉపాధి అవకాశాల ను ప్రోత్సహించడం కోసం ఒక మహత్వపూర్ణమైన ముందడుగు కాగలదు.

మహాపరినిర్వాణ మందిరం లో అభిధమ్మ దినం

ప్రధాన మంత్రి మహాపరినిర్వాణ మందిరాన్ని సందర్శించి, శయన ముద్ర లో గల భగవాన్ బుద్ధు ని విగ్రహానికి అర్చన చేస్తారు; అంతేకాక చీవర్ ను సమర్పిస్తారు. ఈ సందర్భం లో ఆయన బోధి వృక్షం మొక్క ను ఒకదాని ని నాటుతారు కూడాను.

అభిధమ్మ దినం సూచకం గా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమం లో ప్రధాన మంత్రి పాలుపంచుకొంటారు. ఈ దినం బౌద్ధ భిక్షువుల కోసం మూడు నెలల పాటు సాగే వర్ష రుతు ప్రస్థానం .. వర్షావాస్ లేదా 'వాసా' ముగింపు నకు ప్రతీక. ఈ కాలం లో బౌద్ధ భిక్షువులు విహారం తో పాటు మఠం లో ఒక స్థానం లో ఉంటూ ప్రార్థనలు జరుపుతుంటారు. ఈ కార్యక్రమం లో శ్రీ లంక, థాయిలాండ్, మ్యాంమార్, దక్షిణ కొరియా, నేపాల్, భూటాన్ ఇంకా కంబోడియా లకు చెందిన ప్రముఖ భిక్షువుల తో పాటు వివిధ దేశాల రాయబారులు కూడా పాల్గొంటారు.

గుజరాత్ లోని వడ్ నగర్ లోను, ఇతర స్థలాల లోను జరిపిన తవ్వకాల లో లభించిన అజంతా కుడ్యచిత్రాలు, బౌద్ధ సూత్ర హస్తలిపి మరియు బౌద్ధ కళా కృతుల తో ఏర్పాటైన ప్రదర్శన ను ప్రధాన మంత్రి సందర్శిస్తారు.

అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవం మరియు శంకుస్థాపన

కుశీనగర్ లోని బర్ వా అటవీప్రదేశం లో ఏర్పాటు చేసే ఒక సార్వజనిక కార్యక్రమం లో ప్రధాన మంత్రి పాల్గొంటారు. 280 కోట్ల రూపాయల కంటే అధిక వ్యయం తో నిర్మించే రాజకీయ మెడికల్ కాలేజ్, కుశీనగర్ కు ఈ సందర్భం లో ఆయన శంకుస్థాపన చేస్తారు. మెడికల్ కాలేజీ లో 500 పడకల తో కూడిన ఒక ఆసుపత్రి కూడా ఉంటుంది. ఆ కాలేజీ లో విద్యాసంవత్సరం 2022-2023 లో ఎమ్ బిబిఎస్ పాఠ్యక్రమానికి గాను 100 మంది విద్యార్థులకు ప్రవేశాలను కల్పించడం జరుగుతుంది. ప్రధాన మంత్రి 180 కోట్ల రూపాయలకు పైగా విలువైన 12 అభివృద్ధి పథకాలను కొన్నిటిని ప్రారంభించడం తో పాటు మరికొన్నిటికి శంకుస్థాపన కూడా చేస్తారు.

టూరిజం షార్ట్ ఫిల్మ్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్ , అక్టోబర్ 19:రాష్ట్రంలో ఎన్నో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ టూరిజం ప్రమోషన్ లో భాగంగా.. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రకృతి సహజంగా ఏర్పడిన అద్భుత పర్యాటక కేంద్రం 'సోమశిల' పై ప్రముఖ డాక్యుమెంటరీ డైరెక్టర్ దూలం సత్యనారాయణ రూపొందించిన 'టూరిజం షార్ట్ ఫిల్మ్' ను మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణలోని పర్యాటక కేంద్రాలను గత పాలకులు ఎంతో నిర్లక్ష్యం చేశారన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాలైన కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్, మన్యం కొండ వెంకటేశ్వర స్వామి దేవాలయం, పిల్లల మర్రి, ఉమా మహే శ్వరం, అక్క మహాదేవి గుహలు, ఫర్హాబాద్, సింగోటం, సోమశిల లాంటి అద్భుతమైన పర్యాటక ప్రదేశాలతో పాటు కృష్ణా నది తీరం వెంట ఉన్న ప్రకృతి సహజంగా ఏర్పడిన ఎన్నో సుందరమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న పర్యాటక కేంద్రాలకు తగిన ప్రచారం కల్పించి పర్యాటకులను రాష్ట్రానికి పెద్ద ఎత్తున ఆకర్షించేందుకు ఎన్నో కార్యక్ర మాల ను రూపొందిస్తున్నామన్నారు. పర్యాట క ప్రదేశాల విశిష్టత పై ప్రముఖ డాక్యుమెంటరీ డైరెక్టర్ దూలం సత్యనారాయణ నేతృత్వంలో టూరిజం షార్ట్ ఫిల్మ్ లను రూ పొందించి తగిన ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ విద్యా సంస్థల చైర్మన్ రవికుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ల సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉద్యోగుల సంఘం నాయకులు మోహన్ సింగ్ పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ భేదించుకునినా, కవినా,
బాధపడుతినా, సంతసిన, పద్యాల్లన-మా
ఆచార్య తిరుమలాఖ్యుడు
త్రొక్కుడము పొంది నాడు బహుదుఃఖములలోనా॥

(అక్టోబర్ 20 ప్రముఖ పద్యకవి ఆచార్య తిరుమల జయంతి...)

-రాధశ్రీ
సెల్: 9494481210

ఆహ్వానము

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం
నవ్య సాహితీ సమితి సంయుక్తాధ్వర్యంలో
శ్రీ త్యాగరాయ గానసభ సౌజన్యంతో

మహాకవి నండూరి రామకృష్ణమాచార్య
శత జయంతి మహోత్సవం

ఆదివారం, 24-10-2021 సా॥ 5-30 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్య అతిథి :
డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్. (ఐ.)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు

సభాధ్యక్షులు :
ఆచార్య మాడభూషి శ్రీధరాచార్యులు
పూర్వ కేంద్ర సమాచారశాఖ కమిషనర్
డీన్, న్యాయశాస్త్ర కళాశాల, మహేంద్ర విశ్వవిద్యాలయం

గౌరవ అతిథి :
శ్రీ కళా వి.ఎస్. జనార్ధనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య వ్యక్తిత్వ విశ్లేషణ :
డా॥ ముక్తేవి భారతి
ప్రముఖ రచయిత్రి
శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి
ప్రముఖ రచయిత్రి

ఆత్మీయ అతిథులు :
శ్రీ కె. సాగరరావు
శ్రీ ఆత్మకూరి గాంధి

ప్రముఖ కవులచే "కవి సమ్మేళనం"

వి. విజయ కుమార్
అధ్యక్షులు
నవ్య సాహితీ సమితి

డా॥ ఆచార్య ఫణీంద్ర
ప్రధాన కార్యదర్శి
నండూరి సాహిత్య పీఠం

ఆస్టియోఫోరెసిస్ వ్యాధిని ఆదిలోనే అరికట్టవచ్చు

(20 అక్టోబర్ "ప్రపంచ ఆస్టియోఫోరెసిస్ దినం" సందర్భంగా)

'ఆస్టియోఫోరెసిస్' అనబడే వ్యాధిని బోలు ఎముకల వ్యాధి లేదా ముసలితనంలో ఎముకలు మెత్తబడడంగా, పెలుసుదనం కలగడంగా అర్థం చేసుకోవచ్చు. ప్రపంచ జనాభాలో 50 ఏళ్ళకు పైబడిన ప్రతి ముగ్గురు మహిళల్లో ఒక్కరు, ప్రతి ఐదుగురు పురుషుల్లో ఒక్కరు ఆస్టియోఫోరెసిస్ అనబడే ఎముకల బలహీనత వ్యాధితో బాధ పడడం జరుగుతున్నది. ఆస్టియోఫోరెసిస్ వ్యాధి బారిన పడిన వ్యక్తులకు అతి చిన్న దెబ్బ తగిలినా ఎముకలు విరిగి పోతాయి. ఇలాంటి వయోవృద్ధుల ఎముకలు విరిగితే ప్రాణ భయం, తీవ్ర నొప్పి, ఇతరులపై ఆధారపడే జీవితం, అంగవైకల్యాలతో పాటు దీర్ఘకాల వైద్యం అవసరం అవుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 9 మిలియన్ల ఫ్రాక్చర్లు జరుగుతున్నాయని అంచనా వేశారు. ఎముకల బలహీనతకు సంబంధించిన ఆస్టియోఫోరెసిస్ వ్యాధి పట్ల అవగాహన, నివారించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స విధానం లాంటి అంశాల పట్ల సామాన్య జనానికి అవగాహన కల్పించడానికి ప్రతి ఏట ప్రపంచ దేశాలు 20 అక్టోబర్ రోజున 'ప్రపంచ బోలు ఎముకల వ్యాధి లేదా ఆస్టియోఫోరెసిస్ దినం' పాటిస్తారు. 'ఇంటర్నేషనల్ ఆస్టియోఫోరెసిస్ ఫౌండేషన్ (ఐఓయఫ్)' సౌజన్యంతో 'ప్రపంచ ఆస్టియోఫోరెసిస్ దినం' నిర్వహించడం జరుగుతున్నది. 20 అక్టోబర్ 1996న 'యుకె నేషనల్ ఆస్టియోఫోరెసిస్ సొసైటీ' ప్రారంభమైన రోజుకు గుర్తుగా 'వరల్డ్ ఆస్టియోఫోరెసిస్ డే' పాటించడం ఆనవాయితీగా మారింది.

ఎముకల ఆరోగ్యానికి ఆరు మార్గాలు:

1. ప్రతి దినం క్రమం తప్పకుండా ఎముకల పటిష్టతకు సంబంధించిన వ్యాయామాలు చేయడం మరువరాదు. బరువులు ఎత్తడం, కండరాల పటిష్టతకు సంబంధించిన వ్యాయామాలు నిపుణుల సూచనల మేరకు చేయాలి.

2. ఎముకల పటిష్టతకు ఉపకరించే కాల్షియం, విటమిన్ డి, ప్రోటీన్లు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ప్రతి రోజు ఉదయం సూర్యరశ్మి ఉన్న ప్రదేశంలో ఉండడంతో విటమిన్ డి దొరుకుతుంది.

3. శరీర బరువును అదుపు చేయడం, పొగ త్రాగడాన్ని నిరోధించడం, ఆల్కహాల్ అతి సేవనాన్ని తగ్గించడం చేయాలి.

4. బోలు ఎముకల వ్యాధితో బాధపడుతున్న కుటుంబ సభ్యుల చరిత్ర, ఇతర వ్యాధులకు సంబంధించిన మందులు వాడడంతో కూడా కొన్ని సమయాల్లో ఆస్టియోఫోరెసిస్ రావచ్చని తెలుసుకోవాలి.

5. ఆస్టియోఫోరెసిస్‌ను అదుపు చేయడం, వైద్యం అందించడం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం, తరుచుగా పరీక్షలు చేసుకోవడం లాంటి చర్యలు సత్వరమే తీసుకోవాలి.

6. ఆస్టియోఫోరెసిస్‌ను అదుపు చేయడానికి ఆహార నియమాలు పాటించడం, స్థూలకాయం రాకుండా చూసుకోవడం, వ్యాధిగ్రస్థులు తగు చికిత్సలు చేయించడం ఉత్తమ మార్గాలని గమనించాలి.

వరల్డ్ ఆస్టియోఫోరెసిస్ డే-2021 నినాదంగా 'ఎముకల పటిష్టతకు చర్యలు తీసుకుందాం (టేక్ ఆక్షన్ ఫర్ బోన్ హెల్త్)' అనబడే అంశంతో అవగాహనలు కల్పిస్తున్నారు. మిలియన్ల వయోవృద్ధులు బాధ పడుతున్న ఆస్టియోఫోరెసిస్ వ్యాధి తగు జాగ్రత్తలతో నివారించదగినదని నమ్మాలి. ఈ వ్యాధి బారిన పడిన కుటుంబ పెద్దలు దీర్ఘకాలిక చికిత్సలు తీసుకోవలసి రావడంతో కుటుంబం ఆర్థిక సామాజికంగా చిద్రమై పోతుందని గుర్తుంచుకోవాలి. 1990తో పోల్చితే 2050 నాటికి ఎముకల బలహీనతలతో జరిగే ఫ్రాక్చర్లు పురుషుల్లో 310 శాతం, స్త్రీల్లో 240 శాతం పెరుగవచ్చని అంచనా. పట్టణీకరణ పెరగడం, వృద్ధుల జనాభా పెరగడంతో ఆస్టియోఫోరెసిస్ తీవ్రత అధికం అవుతుంది. ఆస్టియోఫోరెసిస్ వ్యాధిగ్రస్థుల్లో 60 శాతం సహాయకులు అవసరం కావడం, 20 శాతం దీర్ఘకాలిక వైద్యం తీసుకోవలసిరావడం జరుగుతుంది. ఆస్టియోఫోరెసిస్ వ్యాధి పట్ల లోతైన అవగాహన కలిగి ఎముకల పటిష్టతకు గట్టి అడుగులు వేసి, ఎముకలు విరిగి పోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎముకల పటుత్వ ఆరోగ్యమే కుటుంబ సౌభాగ్యమని భావించి నవ్య జీవనశైలితో నవ్వులను పంచుతూ, నాణ్యమైన జీవితాన్ని ఆశ్వాదిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఈ నెల 20న మహర్షి వాల్మీకి జయంతి నిర్వహణ..!

- జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి ,అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి) అక్టోబర్ 20న మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వ ఉత్సవంగా ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు.

ఈ నెల 20న ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్లో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఇట్టి కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, అధికారులు ,వివిధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రజావాణికి అధికారులు హాజరు కావాలి....!

- జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, అక్టోబర్ 19(నేటినిజం ప్రతినిధి) ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు విధిగా హాజరవ్వాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు.

జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యతో వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లతో కలిసి అర్జీలను స్వీకరించారు. సమస్యల గురించి అర్జీదారులు తమ గోడును కలెక్టర్కు విన్నవించుకున్నారు. అప్పటికప్పుడు పరిష్కరించే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా నిర్ణీత సమయంలోగా హాజరుకావాలని ఆయన స్పష్టం చేశారు. తమకు బదులుగా తమ సిబ్బందిలో ఎవరో ఒకరిని పంపడం సరికాదన్నారు. జవాబుదారి గల అధికారి ఉన్నప్పుడే సమస్యను పరిష్కరించ వీలవుతుందన్నారు. వచ్చే వారం నుండి ప్రజావాణికి హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు హాజరై అక్కడికక్కడే పరిష్కరించగలిగే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, రాజర్షి షా, డి ఆర్ ఓ రాధిక రమణి, ఏఓ స్వర్ణలత,వివిధ శాఖల అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

సంగారెడ్డి, అక్టోబర్ 19:: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన హత్నూర మండలంలోని గుండ్లమచూనూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శేరి మహేశ్(32) సోమవారం ఇంట్లో నుంచి భయటకు వెళ్లాడు.

రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం తెల్లవారు జామున మృతుడి తండ్రి యాదయ్య గ్రామ శివారులోని పెద్దచెరువు వైపు వెళ్తున్న క్రమంలో గ్రామ శివారులో గల పెద్దచెరువు తూము వద్ద మహేశ్ మృతదేహం కనిపించింది.

కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెంది ఉండవచ్చు అని స్థానికులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

4 గేట్ల ద్వారా నీటి విడుదల

నందికొండ, అక్టోబర్ 19:: నాగార్జునసాగర్ డ్యాం 4 క్రస్ట్ గేట్ల ద్వారా 32316 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 590 (312.4050 టీఎంసీలు) అడుగులకు గాను 589.80 (311.4474 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉంది.

నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9633 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7436 క్యూసె క్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33982 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వరద కాల్వ ద్వారా నీటి విడుదల లేదు. రిజర్వా యర్ నుంచి 85167 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతుండగా, అదే స్థాయిలో ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు ప్రస్తుతం 883.90 అడుగులు (209.5948 టీఎంసీలు) ఉంది. శ్రీశైలంకు 33946 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది.

సీఎంఈలకు సంబంధించి లభించిన క్లూ సౌర వాతావరణ అంచనాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది

న్యూఢిల్లీ, అక్టోబర్ 19:పరిశోధనల కోసం ఖగోళ శాస్త్రవేత్తలు సూర్యునిపై అస్తవ్యస్త అయస్కాంత క్షేత్రాలు లేదా చురుకైన ప్రాంతాలను అన్వేషిస్తారు. కొన్నిసార్లు ఇవి కరోనల్ మాస్ ఎజెక్షన్ (సీఎంఈ) తో పాటుగా సౌర మంటలను ప్రదర్శిస్తాయి. సూర్యుని ఉపరితలంపై అయస్కాంత క్షేత్రం నిర్మాణం మారడం లేదా సీఎంఈ పొగ వస్తుందో లేదో తాజాగా శాస్త్రవేత్తలు నిర్ధారించగలిగారు. దీనివల్ల సౌర వాతావరణం అంచనాలను మెరుగుపరచవచ్చు. ఇది భూమిపై విద్యుత్ , కమ్యూనికేషన్ వ్యవస్థలను, అంతరిక్షంలోని ఉపగ్రహ వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది.

సూర్యుడి ఉపరితలం దగ్గర ఒక సంక్లిష్ట అయస్కాంత క్షేత్రం ఉంటుంది. అది దాని వేడి ప్లాస్మాకు అనుసంధానమై ఉంటుంది. ప్లాస్మా ఈ క్షేత్రంలో తిరుగుతున్నప్పుడు దాని ఆకృతిని ఎప్పటికప్పుడు మారుస్తుంది. ఈ అయస్కాంత క్షేత్రం సూర్యుని ఉపరితలంపై కొన్ని ప్రాంతాల నుండి (యాక్టివ్ రీజియన్స్ అని పిలుస్తారు) లూప్‌లలో విస్ఫోటనం చెందుతుంది. వక్రీకృతమవుతుంది. దాని జ్యామితిని తిరిగి మార్చవచ్చు. ఈ ప్రక్రియలో విపరీతమైన శక్తిని విడుదల చేస్తుంది. ఇది అప్పటి వరకు అయస్కాంత శక్తిగా నిల్వ అవుతుంది. ఈ ప్రక్రియలో వెలువడే కాంతిని (అనేక వేవ్‌బ్యాండ్‌లలో) సోలార్ ఫ్లేర్ అంటారు. సీఎంఈ భారీ మొత్తంలో వేడి గ్యాస్, దాని అయస్కాంత క్షేత్రంతో, అధిక వేగంతో సౌర కరోనాలోకి విడుదల చేస్తుంది.

కొన్ని క్రియాశీల ప్రాంతాలు మంటలను ఉత్పత్తి చేస్తాయి. మరికొన్ని కొన్ని సీఎంఈలను ఉత్పత్తి చేస్తాయి. కొన్ని రెండింటినీ తయారు చేస్తాయి. ఈ ప్రాంతంలోని అయస్కాంత క్షేత్రంలో ఏదో రహస్యం ఉందని మునుపటి అధ్యయనాలు సూచించినప్పటికీ దానిని ఇప్పటి వరకు ఎవరూ ఛేదించలేకపోయారు.

శక్తిని నిల్వ చేసే అంతర్లీన అయస్కాంత ఆకృతీకరణ మాగ్నెటిక్ హెలిసిటీ అని పిలిచే పరామితి ద్వారా లెక్కిస్తారు. ఇది వక్రీకృత అయస్కాంత క్షేత్రాలను కలిగి ఉంటుంది. క్రియాశీల ప్రాంతం (ఏఆర్) కరోనా వంటి మలుపులు లేదా అయస్కాంత హెలిసిటీతో నిండి ఉంటుంది. హెలిసిటీ థ్రెషోల్డ్ స్థాయికి మించినప్పుడు, అదనపు హెలిసిటీని తొలగించడానికి సీఎంఈ ఒక్కటే మార్గం. ఏఆర్ పరిణామం సమయంలో సీఎంఈ విస్ఫోటనాన్ని అంచనా వేయడానికి కరోనల్ హెలిసిటీ బడ్జెట్ ప్రవేశ స్థాయిని కనుగొనడం ఇప్పటికీ కష్టమే.

బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్.. కేంద్ర ప్రభుత్వ సైన్స్ ఆ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్కు చెందిన స్వయంప్రతిపత్తి సంస్థ. ఇందులో పనిచేసే డాక్టర్ వేమారెడ్డి సీఎంఈ లు లేకుండా యాక్టివ్ రీజియన్‌లో ఏఆర్ 12257 అనే హెలిసిటీ ఇంజెక్షన్ విలక్షణమైన పరిణామాన్ని మొదట గుర్తించారు. సూర్యుని అయస్కాంత , కరోనల్ చిత్రాల ఆధారంగా శాస్త్రవేత్తలు ఈ ఖగోళ సంఘటనను అధ్యయనం చేశారు. అంతరిక్షంలో నాసా సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ ప్రతి 12 నిమిషాలకు ఒకసారి ఫొటోలు తీస్తుంది. ఏఆర్ మొదటి 2.5 రోజులలో సానుకూల హెలిసిటీని ఇంజెక్ట్ చేసినట్టు గుర్తించారు. హెలిసిటీ (లేదా ట్విస్ట్) సంకేత సమయంతో తిరిగిన క్రియాశీల ప్రాంతాలు కరోనల్ మాస్ ఎజెక్షన్‌ను ఉత్పత్తి చేయలేవని అధ్యయనం తేల్చింది. రాయల్ ఆస్ట్రోనామికల్ సొసైటీ జర్నల్‌లో ఈ ఫలితాలు ప్రచురితమయ్యాయి.

"విచిత్రం ఏంటంటే.. మేము డేటా నుండి తీసుకున్న అయస్కాంత నిర్మాణం క్రియాశీల ప్రాంతం ప్రధాన భాగంలో ఎలాంటి మలుపునూ చూపించలేదు" అని డాక్టర్ వేమారెడ్డి అన్నారు. ఐఐఏ బృందం ప్రకారం, హెలిసిటీ ఎలా ఇంజెక్ట్ చేయబడుతుందనే అధ్యయనాలు క్రియాశీల ప్రాంతం విస్ఫోటనాత్మక సంభావ్యతను అంచనా వేయడానికి కీలకం. ఈ ఫలితాలు నక్షత్రాలు , గ్రహాలలో అయస్కాంత క్షేత్ర ఉత్పత్తిపై కూడా వెలుగును ప్రసరిస్తాయని భావిస్తున్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

అమరావతి, అక్టోబర్ 19:రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దపల్లి పోలీస్ స్టేషన్ లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపద సమయంలో మరొకరి ప్రాణం కాపాడుతుందన్నారు.

యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎందరో పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల వల్ల ప్రస్తుతం సమాజంలో శాంతి నెలకొందన్నారు. అమరుల త్యాగాలను స్మరిస్తూ రామగుండం కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాలో వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పెద్దపల్లి పోలీస్ శాఖ, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి రవీందర్, ఏసీపీ సారంగపాణి, సీఐలు ప్రదీప్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, అనిల్, ఎస్ఐ లు రాజేష్, ఉపేందర్, వెంకటేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, జానీ పాషా, రాజ వర్ధన్, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ మందల వాసుదేవ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు రాజగోపాల్ రెడ్డి, వెంకట్ ట్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

దళితులు బాగుపడడం ఈటలకు ఇష్టం లేదు: మంత్రి కొప్పుల ఈశ్వర్

జమ్మికుంట, అక్టోబర్ 19: దళితులు బాగుపడడం ఈటల రాజేందర్‌కు ఇష్టం లేదని, అందుకే ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయించి మరీ సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దళితబంధు పథకాన్ని ఆపివేయించాడని మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి 19వ వార్డులో కొప్పుల ఈశ్వర్ మంగళవారం టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తరఫున ప్రచారం నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్న, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సతీమణి శ్వేతతో కలిసి ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. నిరుపేదలైన దళితులు గొప్పగా ఎదిగితే తన రాజకీయం నడవదని, ఇక టీఆర్ఎస్‌కు ఎదురే ఉండదని ఈటల రాజేందర్ భయపడ్డాడని అన్నారు. దళితబంధు పథకాన్ని మొదటినుంచీ ఆపేందుకు ఈటల కుటిల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఎంతో ప్రేమతో ప్రారంభించిన ఈ పథకాన్ని ఈటల రాజేందర్ కేవలం 15 రోజులు మాత్రమే ఆపగలడని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఈటల ఆటలు చెల్లవన్నారు. దళితబంధు పథకం ద్వారా రాష్ట్రంలోని దళితుల తలరాత మారిపోతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు, అపోహలు అక్కర్లేదన్నారు. ముఖ్యమంత్రి ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసి తీరుతడని, దళితుల జీవితాల్లో గొప్ప మార్పు తీసుకువస్తడని చెప్పారు.

అభివృద్ధి,సంక్షేమంలో తెలంగాణను మించిన రాష్ట్రం దేశంలో మరొకటి లేదని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. కరోనా కష్టకాలంలోనూ ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమం ఆగలేదని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ దృఢ సంకల్పంతో రాష్ట్రంలో ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తున్నదని, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. హుజూరాబాద్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇదే రీతిలో ముందుకు సాగాలంటే కారు గుర్తుకు ఓటేసి గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌నే గెలిపించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలను కోరారు.

అన్నింటా తెలంగాణ అభివృద్ధి.. : గెల్లు శ్వేత

తెలంగాణ వస్తే చీకట్లు కమ్ముకుంటయని ఆనాడు సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారని, కానీ అది నిజం కాదని ఆచరణలో తేలిపోయిందని గెల్లు శ్వేత పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం గొప్పగా అభివృద్ధి చెందిందని తెలిపారు. అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. మన రాష్ట్రంలో అమలవుతున్న అద్భుత పథకాలు మరే రాష్ట్రంలో కనిపించవన్నారు. హుజూరాబాద్ అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటేసి గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని శ్వేత కోరారు. వారివెంట టీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు మల్లయ్య, రాము, దిలీప్, టీఆర్ఎస్ నాయకులు సమ్మిరెడ్డి, కశ్యప్‌రెడ్డి, కోటి, తదితరులున్నారు.

జిల్లా గణాంక దర్శిని- 2020 పుస్తకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, అక్టోబర్ 19(నేటినిజం ప్రతినిధి) ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో రూపొందించిన జిల్లా గణాంక దర్శిని -2020 పుస్తకాన్ని సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు విడుదల చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గణాంక దర్శినితో జిల్లా పూర్తి సమాచారాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు.

జిల్లా సమగ్ర సమాచారాన్ని పుస్తకరూపంలో రూపొందించినట్లు తెలిపారు. జిల్లా గణాంక దర్శిని లో జిల్లాకు సంబంధించిన సమాచారంతోపాటు, జిల్లాలోని అన్ని శాఖల సమాచారాన్ని గణాంక రూపంలో పొందుపరచడం జరిగిందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి , రాజర్షి షా, ముఖ్య ప్రణాళిక అధికారి పి. మనోహర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వరికి కనీస మద్దతు ధర విలువగా రూ.11099.25 కోట్లు అందుకోనున్న రైతులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 19:కేఎంఎస్ 2021-22లో అక్టోబర్ 17, 2021వ తేదీ వరకు 56.62 ఎల్ఎంటీలకు పైగా వరి సేకరించబడింది. ఛండీగఢ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ & కాశ్మీర్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్ మరియు ఉత్తరాఖండ్ రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో కొనుగోళ్లు జరిగాయి. కనీస మద్దతు ధర వద్ద ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ (కేఎంఎస్) 2021-22.. ఇటీవల ప్రారంభమైంది. ఇందులో ఎంఎస్‌పీ విలువతో 371919 మంది రైతులకు రూ.11,099.25 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది.

ఆటోమెటిక్ ట్రెయిన్ ప్రొటెక్షన్.. ఇక రైళ్లు ఢీకొనవ్

అమరావతి, అక్టోబర్ 19: రైళ్లు ఢీకొనడాన్ని నివారించేందుకు దేశీయంగా రూపొందించిన వ్యవస్థ 'కవచ్' ప్రాజెక్టుపై రైల్వే బోర్డు డైరెక్టర్ జనరల్(భద్రత) రవీందర్ గుప్తా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యతో కలిసి సమీ క్షించారు. జోన్ పరిధిలో భద్రత, ట్రెయిన్ కొలిజన్ అవార్డు?నెన్స్ సిస్టం (టీసీఏఎస్) 'కవచ్' ప్రాజెక్టు అమలు తీరుపై సికింద్రాబాద్లోని రైల్ నిలయం నుంచి సోమవారం నిర్వహించిన సమావేశంలో వివిధ విభాగాల అధిపతులతోపాటు విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజినల్ రైల్వే మేనే జర్లు(డీఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

డైరెక్టర్ జనరల్ రవీందర్ గుప్తా మాట్లాడుతూ జోన్ పరిధిలో రైళ్లు ఢీకొనడాన్ని నివారించే 'కవచ్' వ్యవస్థ అమలు తీరుతెన్నులపై చర్చించారు. రైళ్లు ఢీకొనడాన్ని నివారించేందుకు దేశీయంగా రూపొందించిన ఆటోమెటిక్ ట్రెయిన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థ, సిగ్నల్ డిస్‌ప్లేతో సహా అప్డేట్ అంశాలు, అధిక వేగం నిరోధం, లెవల్ క్రాసింగ్స్ వద్ద ఆటోమె టిక్ విజిల్ శబ్దం రావడం, అత్యవసర సమయాల్లో ఎస్ఓఎస్ సందేశాల వ్యవస్థపై మాట్లాడారు.

ఈ విధానం అభివృద్ధి, ప్రయోగాలపై అధికారుల, సిబ్బంది కృషి, బృందం పనితీరును అభినందించారు. భద్రతా విధానాల అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. శీతాకాలం దృష్ట్యా ట్రాక్ నిర్వహణలో మెరుగైన జాగ్రత్తలు తీసుకోవాలని, తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. కీలకమైన సెక్షన్లలో పాయింట్లు-, క్రాసింగ్, వంతెనల మార్గాలు వంటి చోట్ల క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశి ంచారు. రోడ్ అండర్ బ్రిడ్జీ(ఆర్యూబీలు)ల వద్ద నీరు నిల్వ ఉండకుండా రెండు రకాల ఎత్తుగల సబ్వేల ఏర్పాటు-, ప్రైవేట్ సైడింగ్స్ వద్ద వీడియో నిఘా వ్యవస్థతో సీసీ టీవీ కెమరాల ఏర్పాటు, లోకో సిబ్బందికి శిక్షణ పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జీఎం వివ రించారు.

ఎలాంటి పరిస్థితుల్లో అయినా అవాంఛనీయ ఘటనలు ఎదురైతే ఎదుర్కోవడానికి నిరంతరంగా తనఖీలు నిర్వహించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్య ఆరు డివిజన్ల అధికారులకు సూచించారు. భద్రతా మార్గదర్శకాలపై అప్రమత్తంగా ఉంటూ కచ్చితంగా పాటించాలని ఆయన సిబ్బందికి సూచించారు.

కొవిడ్ నియంత్రణల సడలింపు : అర్ధరాత్రి వరకూ రెస్టారెంట్లకు అనుమతి!

ముంబై : మహారాష్ట్రలో కరోనా వైరస్ వ్యాప్తి తగ్గుముఖం పట్టడంతో కొవిడ్-19 నియంత్రణలను రాష్ట్ర ప్రభుత్వం సడలించింది. మహారాష్ట్ర అంతటా అన్ని రెస్టారెంట్లు, తినుబండారాల దుకాణాలను అర్ధరాత్రి 12 గంటల వరకూ అనుమతించాలని నిర్ణయించింది.

ఇతర అనుమతించిన అన్ని వ్యాపార సంస్థలు, దుకాణాలు రాత్రి 11 గంటల వరకూ తెరిచిఉంచేందుకు ప్రభుత్వం అనుమతించింది. వైరస్ వ్యాప్తికి అనుగుణంగా స్థానిక అధికారులు ఈ సమయాలను కుదించవచ్చని, ముందస్తు అనుమతి లేకుండా వీటికి సడలింపులు ఇవ్వరాదని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ప్రభుత్వాన్ని జన-సన్నిహితం చేయడంలో ప్రజా సమాచార ప్రదాతల పాత్ర కీలకం: ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: సుపరిపాలనలో సమర్థ సమాచార ప్రదానానికిగల కీలక పాత్రను ఉపరాష్ట్రపతి శ్రీ ఎం.వెంకయ్యనాయుడు నొక్కిచెప్పారు. ప్రభుత్వ విధానాలు, వినూత్న చర్యల గురించి సకాలంలో, స్థానిక భాషల్లో చేరవేయడం ద్వారా ప్రజలకు సాధికారత కల్పించాల్సిందిగా సమాచార ప్రదాతలకు ఆయన పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లోని తన నివాసంలో ఇవాళ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్)-2020 బ్యాచ్ శిక్షణార్థి అధికారుల బృందంతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వాలు-పౌరుల మధ్య అంతరాన్ని తొలగించడంలో ప్రజా సమాచార ప్రదాతలు కీలక పాత్ర పోషిస్తారని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. "వివిధ పథకాల గురించి మీరు సరళమైన, స్పష్టమైన స్థానిక భాషలో ప్రజలకు సమాచారం ఇవ్వగలిగితే తమ హక్కులేమిటో, ప్రభుత్వ ప్రక్రియలు ఎలా ఉంటాయో వారు మెరుగైన రీతిలో అవగాహన చేసుకోగలరు. తద్వారా పారదర్శకత ప్రతిఫలిస్తుంది" అని ఆయన ప్రొబేషనరీ అధికారులకు ప్రబోధించారు.

ప్రభుత్వ సమాచార ప్రదానంలో 'సందిగ్ధరహిత సమాచారం' అత్యంత ముఖ్యమైనది శ్రీ నాయుడు స్పష్టం చేశారు. ఆ మేరకు అవాస్తవ, అబద్ధపు వార్తల బెడదను సమర్థంగా ఎదుర్కొనడంపై నిశిత దృష్టి సారించాలని 'ఐఐఎస్' అధికారులకు సూచించారు. కొన్ని వర్గాల ప్రజల్లో 'లైంగిక అసమానతలు, టీకాలపై సందేహాలు' వంటి అంశాలపై అనుమానం-సందేహం ఉన్నాయని, అటువంటి సామాజిక అంశాలు ఇతివృత్తంగా పనిచేయాలని ఆయన కోరారు. సమాచార మాధ్యమాలు శక్తిమంతమైన ఉపకరణాలని, ఆకాంక్షిత పరివర్తనను తేవడంలో వాటిని బాధ్యతాయుతంగా వాడుకోవాల్సి ఉందని ఆయన సూచించారు.

తదనుగుణంగా "సంధాన కండి.. సమాచారమివ్వండి.. మార్పు తెండి" అని తనదైన శైలిలో ఉప రాష్ట్రపతి ఉద్బోధించారు.

ఐఐఎస్ శిక్షణార్థి అధికారులు ప్రస్తుతం హైదరాబాద్‌లోని పత్రికా సమాచార సంస్థ ప్రాంతీయ కార్యాలయంతోపాటు సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర మాధ్యమ కార్యాలయాలకు అనుసంధానమై శిక్షణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సివిల్ సర్వీసెస్‌ను ఎంచుకోవడంపై యువ అధికారులను ఉప రాష్ట్రపతి అభినందించారు. సరైన సమాచార ప్రదానం ద్వారా ప్రజలకు సాధికారత కల్పించడంలో ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని ఆయన గుర్తుచేశారు.

సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తాను దేశంలోని ఉన్నత పదవులలో ఒకదాన్ని అందుకోగలగడం గురించి ఈ సందర్భంగా శ్రీ నాయుడు గుర్తుచేసుకున్నారు. "ఉన్నత లక్ష్యం? గొప్ప స్వప్నం.. కఠోర శ్రమ.. క్రమశిక్షణలే జీవితంలో విజయాలు సాధించడానికి నాకు తారక మంత్రంగా ఉపయోగపడ్డాయి" అని యువ సివిల్ సర్వీస్ అధికారులకు తెలియజేశారు.

విజయ సాధనలో అంకితభావం ఎంతమాత్రం చెదిరిపోకుండా కృషిని కొనసాగించాలని శిక్షణార్థి అధికారులకు సలహా ఇచ్చారు. క్రీడలుసహా వివిధ భౌతిక కార్యకలాపాల్లో పాలుపంచుకుంటూ శరీర దృఢత్వాన్ని కాపాడుకోవాల్సిందిగా శిక్షణార్థి అధికారులకు ఉప రాష్ట్రపతి సూచించారు. "మెరుగైన భవిష్యత్తు దిశగా ముందడుగు వేయడంలో నేడు మనం చేసే పని అటు ప్రకృతితో, ఇటు సంస్కృతితో ముడిపడినదై ఉండాలి" అని ఆయన ప్రబోధించారు.

అంతకుముందు పీఐబీ-ఆర్ఓబీ, హైదరాబాద్ కార్యాలయ డైరెక్టర్ శ్రీమతి శృతి పాటిల్; డిప్యూటీ డైరెక్టర్ శ్రీ మానస్ కృష్ణకాంత్‌లు రాష్ట్రంలో ఈ ప్రాంతీయ కార్యాలయ సంధాన శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఉప రాష్ట్రపతికి వివరించారు. ఉప రాష్ట్రపతి సచివాలయానికి చెందిన సీనియర్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దళిత ద్రోహి ఈటల రాజేందర్ : ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

సంగారెడ్డి, అక్టోబర్ 19: దళిత బంధును అడ్డకుంటున్న దళిత ద్రోహి ఈటల రాజేందర్ అని అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. మంగళవారం జోగిపేట పట్టణంలోని నాందేడ్ ...అఖోల ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ నాయకులు ఈటల దిష్ట బొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్రంలోని దళితులపై ప్రేమ ఉంటే ప్రతి దళిత కుటుంబానికి బీజేపీ కేంద్రప్రభుత్వం రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే దళిత బంధును రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ అములు చేశారన్నారు.

నేడు కుషినగర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 అక్టోబర్ 20 న ఉత్తరప్రదేశ్ గవర్నర్ శ్రీమతి ఆనందిబెన్ పాటిల్ సమక్షంలో కుషినగర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారు.గవర్నర్ ఆనందిబెన్ పటేల్; యుపి ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా పాల్గొనున్నారు. శ్రీలంక కు చెందిన ప్రముఖులు 125 మంది, బౌద్ధ సన్యాసులను తీసుకువెళుతుంది, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధులు బుద్ధ భగవానుని మహాపరినిర్వాణ స్థలాన్ని సందర్శించే సౌలభ్యాన్ని హైలైట్ చేస్తుంది.

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, దేశంలో విమానాశ్రయ మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడానికి నిరంతర ప్రయత్నంలో, కుషినగర్ విమానాశ్రయాన్ని కొత్త టెర్మినల్ భవనంతో 3600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధి చేసింది, ప్రభుత్వ సహకారంతో రూ .260 కోట్ల అంచనా వ్యయంతో దేశీయ ఉ అంతర్జాతీయ సందర్శకులు మరియు తీర్థయాత్రల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్న ఉత్తరప్రదేశ్. కొత్త టెర్మినల్ గరిష్ట సమయాల్లో 300 మంది ప్రయాణీకులరాకపోకలు సాగించే సామర్థ్యంతో రూపొందించారు.

కుషినగర్ అనేది అంతర్జాతీయ బౌద్ధ తీర్థయాత్ర కేంద్రం, ఇక్కడ గౌతమ్ బుద్ధుడు మహాపరినిర్వాణాన్ని పొందాడు. ఇది లుంబిని, సారనాథ్ మరియు గయలలోని యాత్రా స్థలాలను కలిగి ఉన్న బౌద్ధ సర్క్యూట్ కేంద్ర బిందువు. ఈ విమానాశ్రయం దేశ, విదేశాల నుండి బౌద్ధమతానికి ఎక్కువ మంది అనుచరులను కుషినగర్‌కు ఆకర్షించడంలో సహాయపడుతుంది మరియు బౌద్ధ థీమ్ ఆధారిత సర్క్యూట్ అభివృద్ధిని మెరుగుపరుస్తుంది. లుంబిని, బోధగయ, సారనాథ్, కుషినగర్, శ్రావస్తి, రాజ్‌గిర్, సంకిసా మరియు బౌద్ధ సర్క్యూట్ యొక్క వైశాలి ప్రయాణం తక్కువ సమయంలో కవర్ చేయబడుతుంది.

కుశీనగర్ విమానాశ్రయం ప్రారంభించడం వలన ఈ ప్రాంతంలోని వివిధ బౌద్ధ ప్రదేశాలకు కనెక్టివిటీని అందించడం ద్వారా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు సౌకర్యంగా ఉంటుంది.

దక్షిణ ఆసియా దేశాలతో డైరెక్ట్ ఏవియేషన్ కనెక్టివిటీ శ్రీలంక, జపాన్, తైవాన్, దక్షిణ కొరియా, చైనా, థాయ్‌లాండ్, వియత్నాం, సింగపూర్‌టెక్ నుండి వచ్చే పర్యాటకులు కుషీనగర్ చేరుకోవడానికి మరియు ఈ ప్రాంతంలోని గొప్ప వారసత్వాన్ని అనుభవించడానికి సులభతరం చేస్తుంది. విమానం ప్రారంభోత్సవంతో పర్యాటక ప్రవాహం 20%వరకు పెరుగుతుందని భావిస్తున్నారు.

కుషినగర్ అంతర్జాతీయ విమానాశ్రయం అంతర్జాతీయ విమానయాన పటంలో తీర్థయాత్ర స్థలాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందిస్తుంది. హోటల్ వ్యాపారం, టూరిజం ఏజెన్సీలు, రెస్టారెంట్లు మొదలైన వాటిని ప్రోత్సహించడం ద్వారా ఆతిథ్య పరిశ్రమపై ఇది బహుళ ప్రభావం చూపుతుంది, ఇది ఫీడర్ రవాణా సేవలు, స్థానిక గైడ్ ఉద్యోగాలు మొదలైన వాటిలో అపారమైన అవకాశాలను తెరవడం ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధిని సృష్టిస్తుంది. ప్రపంచ గుర్తింపు పొందండి. ఇది స్థానిక సంస్కృతి మరియు సంప్రదాయాలను పరిరక్షించడానికి సాంస్కృతిక అవగాహనను ప్రోత్సహిస్తుంది.

భారతదేశ భవిష్యత్ ప్రగతి సైన్స్ ఆధారిత ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి ఉంటుందన్న కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 19:భారతదేశ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్ పురోగతి సైన్స్ ఆధారిత ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి ఉంటుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక వ్యవహారాల సహాయ మంత్రి (స్వతంత్ర), భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర) , , ప్రధానమంత్రి కార్యాలయం, ప్రజా ఫిర్యాదులు , సిబ్బంది, పెన్షన్, అణు ఇంధనం, అంతరిక్ష వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆజాదికా అమృత్ మహోత్సవ్ వారపు ప్రారంభ సమావేశంలో ,నీలి ఆర్థిక వ్యవస్థలో స్టార్టప్‌లు, పరిశోధన సాంకేతికత పాత్ర అనే అంశంపై జరిగిన ఇంటరాక్టివ్ సెషన్ లో మాట్లాడుతూ డాక్టర్ జితేంద్ర సింగ్, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో ఇండియా 75 వ స్వాతంత్ర దినోత్సవాలను జరుపుకుంటున్నదని అన్నారు.భారతదేశపు సమగ్ర అభివృద్ధికి శాస్త్ర విజ్ఞానమే కీలకం కానున్నదన్న అంశాన్ని గుర్తంచుకుంటూ రాగల 25 సంవత్సరాలకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత, ప్రపంచంలోని అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా ఆయనకు గల స్థాయి, గత దశాబ్దాలలో మున్నెన్నడూ లేని విధంగా ఇండియాకు మంచి ప్రాధాన్యతను తెచ్చిపెట్టాయని ఆయన అన్నారు. ప్రత్యేకించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి సైన్స్ ఆధారిత అభివృద్ధిపై ప్రత్యేక వైఖరి ఉందని, ఇది అన్ని శాస్త్ర విజ్ఞాన కార్యక్రమాలను సామాన్యుడి జీవితానికి అనుగుణమైన రీతిలో వర్తింప చేసేవిధంగా దృష్టిపెట్టేట్టు చేసిందని ఆయన అన్నారు.

ఇండియా నీలి ఆర్థిక వ్యవస్థ, దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక భాగంగా ఉంటూ మొత్తం సముద్ర వనరుల వ్యవస్థ, సముద్ర ఉత్పత్తులకు సంబంధించి మానవ నిర్మిత ఆర్థిక మౌలిక సదుపాయాలు, సముద్ర రవాణా, దేశ న్యాయ పరిధికి లోబడినసముద్ర తీరప్రాంత జోన్ లు ఉన్నాయన్నారు. ఇవి ఆర్థిక పురోభివృద్ధి, పర్యావరణ సుస్థిరత, జాతీయ భద్రతతో ముడిపడిన ఉత్పత్తుల తయారీ , సేవలకు ఉపకరిస్తాయన్నారు.

నీలి ఆర్థిక వ్యవస్థ కోస్తా తీర ప్రాంతం కలిగిన ఇండియా వంటి దేశాలకు విస్తృల సామాజిక ఆర్థిక అవకాశాలను కల్పించనున్నదని ఆయన అన్నారు. సముద్ర వనరులను సామాజిక ప్రగతికి బాధ్యతాయుతంగా వినియోగించేందుకు ఇది ఉపకరిస్తుందని మంత్రి తెలిపారు.

భూ విజ్ఞాన శాస్త్రం గురించి ప్రస్తావిస్తూ , మంత్రి , భూ వాతావరణాన్ని అధ్యయనం చేయడం, భూమిపైన, భూమి లోపల నీటి ప్రవాహాన్ని అధ్యయనం చేయడం, సముద్రాలు, మహాసముద్రాలను అధ్యయనం చేయడం ఇందులో ఉన్నాయన్నారు. భారతదేశపుసముద్రజలాలు మన అపార సంపద అని డాక్టర్‌జితేంద్ర సింగ్ అన్నారు. అందువల్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన డీప్ ఓషన్ మిషన్, నీలి ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేవనరులను పెంపొందించే విధంగా దృష్టిపెట్టిందన్నారు.

వివిధ వర్గాలకు చెందిన స్టేక్ హోల్డర్లను చేరుకోవలసిన అవసరాన్ని నొక్కిచెబుతూ డాక్టర్ జితేంద్ర సింగ్,ఆజాదికా అమృత్ మహోత్సవ్ ఉద్దేశాలలో ఒకటి పరిశ్రమను అనుసంధానం చేయడమని అన్నారు. అందువల్ల దేశీయ స్టార్టప్‌లు లేదా స్వదేశీ స్టార్టప్‌లు ఈ కార్యక్రమంలో క్రియాశీలంగా పాల్గొంటున్నాయని ఆయన అన్నారు.

పెద్ద ఎత్తున శాస్త్ర విజ్ఞాన రంగ నిపుణులు, సహజ వనరులతో భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ సామాన్య ప్రజలకు సంబంధించిన వివిధ అవసరాలను తీరుస్తున్నదని ఆయన అన్నారు. వ్యవసాయ వాతావరణ సూచనలు అందించడం, దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో ఉప్పునీటిని మంచి నీటిగా మార్చడం వంటివి ఎన్నో ఈ మంత్రిత్వశాఖ చేపడుతున్నదని ఆయన చెప్పారు..

రాగల రోజులలో సముద్ర జలాల కాలుష్యం ఒక పెద్ద సవాలు కానున్నదని, కోస్తా ప్రాంతం కోతకు గురికావడం వల్ల కోస్తా భూములు కోతకు గురౌతాయని అన్నారు. భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ పాండిచ్చేరి తీరం నుంచి ఒక వినూత్న సాంకేతికతను అభివృద్ధి చేసిందని,దీనిని ఇతర ప్రాంతాలలో కూడా బలోపేతం చేయడం జరుగుతుందని కూడా ఆయన అన్నారు.

అంతకు ముందు, భూ విజ్ఞాన మంత్రిత్వశాఖకు నూతనంగా నియమితులైన డాక్టర్ ఎం. రవిచంద్రన్ స్వాగతోపన్యాసం చేశారు. డాక్టర్ నిలోయ్ ఖరే ఈ కార్యక్రమ థీమ్‌ని పరిచయం చేశారు.

నేటి నుంచి షర్మిల పాదయాత్ర.. చేవెళ్ల నుంచి ప్రారంభం

హైదరాబాద్ , అక్టోబర్ 19:తెలంగాణలో షర్మిల పాదయాత్ర తేదీలు, రూట్‌మ్యాప్‌లు ఖరారయ్యాయి. బుధవారం నుంచి ప్రారంభమయ్యే ప్రజాప్రస్థానం యాత్ర 400 రోజులు, 4వేల కిలోమీటర్లు, 90 నియోజకవర్గాలతో పాటు, 14 పార్లమెంట్ నియోజకవర్గాల్లో సాగనుంది. రేపు ఉదయం చేవెళ్లలో బహిరంగ సభ అనంతరం యాత్ర ప్రారంభం కానుండగా రోజుకు 10 నుంచి 15 కిలోమీటర్లు పాదయాత్ర సాగేలా ఏర్పాట్లు చేశారు. యాత్ర మధ్యలో రచ్చబండ కార్యక్రమాలుంటాయని ఆ పార్టీ ముఖ్యనేత తూడి దేవేందర్ తెలిపారు.ప్రతి మంగళవారం చేపడుతున్న నిరుద్యోగ దీక్షలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. సోమవారం లోటస్‌పాండ్‌లో విలేకరులతో దేవేందర్ మాట్లాడుతూ.. ప్రజాప్రస్థానం రేపటి నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో షర్మిల నేడు ఇడుపులపాయలోని తండ్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తారని చెప్పారు.

షర్మిల ఇడుపులపాయకు వెళ్తుండడంతో నేటి నిరుద్యోగ నిరాహారదీక్ష నిర్వహించడం లేదన్నారు. పాద యాత్ర ప్రతిరోజూ ఉదయం 8.30కు మొదలై మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాగుతుందని తెలిపారు. పాదయాత్ర అనగానే తెలుగు రాష్ట్రాల వారికి వైయస్సార్ గుర్తుకొస్తారని అన్నారు.

మద్దతివ్వండి : విజయమ్మ

షర్మిల ప్రారంభించబోయే పాదయాత్రకు మద్దతు ఇవ్వాలని ప్రజలకు వైయస్ విజయమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'వైయస్సార్‌ను ప్రేమించే ప్రతి హృదయానికి, నా బిడ్డను అక్కున చేర్చుకున్న ప్రతి బిడ్డకు పిలుపు..ఈ నెల 20న చేవెళ్లలో రాజన్న సంక్షేమ అభివృద్ధి కోసం, మీ రాజన్న బిడ్డ మరో ప్రజాప్రస్థానం యాత్రలో మొదటి అడుగు వేస్తుం డగా.. మీరందరూ వచ్చి ఆశీర్వదించి.. ఆమె అడుగులో అడుగు వేసి, చేతిలో చే యి కలపండి. మీరు, ఆమె కలిసి ప్రభంజనాన్ని సృష్టించండి.

ఆహ్వానం



కాకతీయ విశ్వవిద్యాలయం
తెలుగు శాఖ

శ్రీ త్యాగరాయ గాన సభ సంయుక్త ఆధ్వర్యంలో

మహాకవి శేషేంద్ర 94వ జయంతి
సాహిత్య సదస్సు

20-10-2021 బుధవారం సాయంత్రం గం॥ 6-00 లకు

వేదిక :
కళా వెంకట సుబ్బారావు వేదిక, శ్రీ త్యాగరాయ గానసభ,
చిక్కడపల్లి, హైదరాబాద్

అధ్యక్షులు : ఆచార్య ననుమాస స్వామి
కవి విమర్శకులు, విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియ విశ్వవిద్యాలయం

ముఖ్య అతిథి : శ్రీ శిఖామణి
ప్రముఖ కవి, విమర్శకులు

ఆత్మీయ అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్దన మూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

కీలకోపన్యాసం : ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు
తెలుగు శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం

ఆత్మీయ అతిథి : శ్రీ బాణాల మన్మథరెడ్డి
మాజీ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామ్స్ & మాజీ టి.ఎస్.పి.ఎస్సీ సభ్యులు

తెలుగు శాఖ,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్

శ్రీమతి కళా శారదాదీక్షితులు
కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ

మోసాలకు పాల్పడుతున్న దొంగ బాబా అరెస్ట్

ఆదిలాబాద్, అక్టోబర్ 19:: మాయమాటలతో మోసాలకు పాల్పడుతున్న దొంగ బాబాను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉట్నూర్ మండలం శ్యాంపూర్ కు చెందిన సూర్య వంశీ ఇటీవల బాబా అవతారమెత్తాడు. తాను పూజల ద్వారా డబ్బులు రెండింతలు చేస్తానని పలువురిని నమ్మించాడు.

బాబా మాయ మాటలు నమ్మి ఆదిలాబాద్ కు చెందిన ఫారూక్ లక్ష రూపాయలు ఇచ్చి పూజలు చేయించాడు. పూజల అనంతరం బాబా రూ.లక్షన్నర ఇచ్చి నమ్మించాడు. ఈనెల 15న 10 లక్షల రూపాయలు ఫారుఖ్ బంధువులు బాబాకి ఇచ్చి పూజలు చేయించగా ఆ డబ్బులతో దొంగ బాబా ఉడాయించాడు.

బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగబాబా సూర్యవంశీతో పాటు అతడికి సహకరించిన మరో మహిళ సంగీతను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 11 లక్షల 70 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనుల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం : మంత్రులు

వనపర్తి, అక్టోబర్ 19:: గిరిజనుల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని మంత్రులు నిరంజన్ రెడ్డి, సత్యవతి రాథోడ్ అన్నారు. ఖిలా ఘనాపూర్ మండలం కర్నె తండాలో తుల్జాభవాని ఆలయాన్ని మంత్రులు ప్రారంభిచారు. ఈ సదర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ..కర్నెతండా తుల్జాభవానీ ఆలయం తెలంగాణ తుల్జాభవానీ ఆలయంగా విలసిల్లాలని ఆకాక్షించారు.

రూ.72 కోట్లతో కర్నెతండా లిఫ్టు సాధించామన్నారు. ప్రభుత్వ దవాఖానను తీసుకువస్తానని హామీనిచ్చారు. కర్నెతండా లిఫ్టుకు సీఎంతో శంకుస్థాపన చేయిస్తామన్నారు. మండలంలోని 24 తండాలకు 20 తండాలకు రహదారులు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. కర్నెతండా లిఫ్టుతో సాగునీటి సమస్య తీరిపోతుందన్నారు. దేవాలయం నిర్మాణానికి సహకరించిన దాతలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ..తుల్జాభవాని మాత ఆలయం నిర్మించుకోవడం గొప్ప విషయం అన్నారు. సీఎం కేసీఆర్‌తోనే గిరజనుల అభివృద్ధి సాధ్యమన్నారు. తండాలను గ్రామ పంచాయతీలు చేసి మన తండాలను మనం పాలించుకునే అవకాశం కల్పించారని ప్రశంసించారు. సాగునీటి రాకతో గిరిజనుల జీవితాలలో మార్పు వచ్చిందన్నారు. వలసలు ఆగిపోయాయన్నారు.

ఘణపురం అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఎంపీపీ కృష్ణానాయక్, జడ్పీటీసీ సామ్యానాయక్, సర్పంచ్ శాంతాబాయి ఉన్నారు.

అన్ని వర్గాల ప్రజలు టీఆర్ఎస్ వైపే : పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్

జమ్మికుంట చౌరస్తా, అక్టోబర్ 19:: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు టీఆర్ఎస్ వైపే ఉన్నారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. ఆయన మంగళవారం జమ్మికుంటలోని 39 వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి పనులు చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని, కారు గుర్తుకు ఓటు వేసి హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెల్లు శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటితో గెలిపించాలని కోరారు.

కుల మతాలకు అతీతంగ ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నాడని అన్నారు. దేశం లోనే ఎక్కడ లేని విధంగ ఇవ్వాల తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని అన్నారు. సరిహద్దు రాష్ట్రాలవారు తెలం గాణ రాష్ట్రంలో కలుస్తామని చెబుతున్నారంటే ఇక్కడ ప్రభుత్వం ఏ స్థాయిలో పని చేస్తుందో అర్థమవుతుందన్నారు.

అట్టడుగు వర్గాల శ్రేయస్సు కోసం ప్రభుత్వం దళితబంధు పథకం తెచ్చి అమలు చేస్తుంటే కడుపు మంటతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి బీజేపీ నాయకులు నిలుపుదల చేసి తినే అన్నంలో మన్ను బోసినట్లు చేశారని విమర్శించారు. దైర్యంగా పోరాడె దమ్ములేక చీకటి పొత్తులు పెట్టుకుని ముందుకు సాగుతున్నారని ఆరోపించారు. ఆయన వెంట జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బచ్చు భాస్కర్, కౌన్సిలర్లు మద్ది లావణ్య, రాజు, శరత్,సురెందర్, రాజమౌళి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గెల్లు శ్రీనివాస్‌యాదవ్ గెలిస్తేనే హుజూరాబాద్ అభివృద్ధి: మంత్రి హరీశ్‌రావు

హుజురాబాద్, అక్టోబర్ 19:ఈటల రాజేందర్ గెలిస్తే కేవలం ఆయనకే లాభమని, కానీ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ గెలిస్తే హుజూరాబాద్ అభివృద్ధి చెందుతుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణ శాఖ అధ్యక్షుడు కే వెంకన్న, డీసీసీ అధికార ప్రతినిధి సలీం నాయకత్వంలో వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, యువకులు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆబాదీ జమ్మికుంటలోని కాటన్ మిల్లులో జరిగిన కార్యక్రమంలో వీరికి మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, టీఆర్ఎస్ పార్టీ, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ కాటన్‌మిల్లులో పనిచేసే హమాలీలు ఏకగ్రీవ తీర్మానం చేసి, ఆ ప్రతిని మంత్రులకు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ జాతీయస్థాయిలో మాత్రమే పోటీపడతాయని, కానీ ఇక్కడ మాత్రం కలిసి పనిచేస్తాయని పేర్కొన్నారు. అభాగ్యులందరికీ నెలనెలా సరిపోయే మొత్తం ఆసరా పింఛన్ అందజేస్తున్న దేశంలోనే ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. ప్రధాని మోడీ సొంత రాష్ట్రంలో కూడా రూ. 600 పింఛన్ మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. రైతులకు రూ.5లక్షల ప్రమాదబీమా ఇక్కడ తప్పా మరే రాష్ట్రంలోనూ లేదన్నారు. ఇంటింటికీ మంచినీళ్లు ఇస్తున్న ఘనతకూడా మనకే దక్కుతుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ.. దేశానికే రోల్‌మోడల్ అని పేర్కొన్నారు. అందుకే మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన పలువురు సర్పంచులు, నాయకులు తాము తెలంగాణలో కలుస్తామంటున్నారని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఇటీవల తమను తెలంగాణలో కలిపిస్తే బాగుండు అని రాయచూరు ఎమ్మెల్యే కూడా అన్నారని గుర్తుచేశారు.

సీఎం కేసీఆర్ ఎంతో ప్రేమతో పథకాలు పెడుతుంటే..కొందరు కక్షకట్టి ఆపేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. దళితబంధు వద్దని బీజేపీ నేత ప్రేమేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడని చెప్పారు. బీజేపీ సర్కారు కార్మిక వ్యతిరేకి అని ఆరోపించారు. బీజేపీ పాలిత గుజరాత్‌లో పనిగంటలు 8 నుంచి 12గంటలకు పెంచి శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. అలాగే, మతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు రాల్చుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంటుందని పేర్కొన్నారు. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, వంట నూనెల ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీలో చేరిన ఈటల రాజేందర్‌కు ఇక్కడి ప్రజలమీద ప్రేమ ఉంటే కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడే ఏ పనీ చేయని ఈటల ఇప్పుడు గెలిస్తే అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే చందంగా తయారవుతుందన్నారు. అదే గెల్లు శ్రీనివాస్‌ను గెలిపిస్తే..తాను కొప్పుల ఈశ్వర్‌తో కలిసి హుజూరాబాద్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

హమాలీల సమస్యలన్నీ పరిష్కరిస్తాం..: మంత్రి కొప్పుల ఈశ్వర్

హమాలీల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీతో కుమ్మక్కయ్యారని మండిపడ్డారు. విషయం తెలిసి ఆ పార్టీని వీడి టీఆర్ఎస్‌లో చేరుతున్నవారందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నానని చెప్పారు. అందరం కలిసికట్టుగా హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, టీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, కౌన్సిలర్లు మల్లయ్య, శ్రీనివాస్, టీఆర్ఎస్ నాయకులు సమ్మిరెడ్డి, కశ్యప్‌రెడ్డి, కోటి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నోటికాడి కూడుతీసిన బీజేపీని తరిమికొట్టండి : సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

హుజురాబాద్, అక్టోబర్ 19: అణగారిన వర్గాల ఆర్థికాభివద్ధి కోసం సీఎం కేసీఆర్ దళిత బంధు పథకం తీసుకువచ్చి అకౌంట్లల్ల రూ.10 లక్షలు వేస్తే చేతికి అందే సమయానికి బీజేపీ పార్టీ అధికార ప్రతినిధి ప్రేమేందర్‌రెడ్డి దళిత బంధు పథకాన్ని ఆపాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసి నోటికాడి కూడు తీసిన బీజేపీ పార్టీని ఓట్లు అడగడానికి ఇళ్ళల్లోకి వస్తే తరమి కొట్టా లని దళిత జాతికి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ బీజేపీ పార్టీ కుట్రలు, కుతంత్రాలతో, అబద్ధపు పునాదులతో హుజూరాబాద్ ఎన్నికల్లో గెలవాలని అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. దళిత సాధికారత పేరుతో సీఎం కేసీఆర్ అసెంబ్లీ లో తీర్మానం చేసి, అమలు చేస్తుంటే ఎన్నికల కోసమేనని ఈటల అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడని అన్నారు. టీఆర్ ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ ఒక్కసారి మాటిస్తే అది అమలయ్యే దాక నిద్రపోడని, ఈ పథకం తాత్కాలికంగా ఆగిపోవచ్చు కానీ మరలా 12 రోజుల తర్వాత అమలు చేయడం జరుగుతుందని అన్నారు.

హుజూరాబాద్ నియోజకవర్గంలోని 17 వేల కుటుంబాలకు డబ్బులు ఖాతాలో జమ అయ్యాయని, కొందరు హర్యానా వెళ్ళి గేదెలు తీసుకువచ్చే పనిలో ఉన్నారని, మరి కొందరివి గ్రౌండింగ్ అవుతున్నాయని తెలిపారు. చేతనైతే టీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న రూ.10 లక్షలకు అదనంగా మరో రూ.10 లక్షలు ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లయితే ముక్కు నేలకు రాస్తానని ఈటల రాజేందర్ అన్నారని, ఈ రోజు నీ పార్టీ వారే లేఖ రాయడం జరిగిందని దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ పథకం ఆపడం వల్ల ఈటల రాజేందర్ లబ్ది పొందాలని చూస్తున్నారని, దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని తెలిపారు. ఇప్పటికే ప్రారంభమయి జరుగుతున్న కార్యక్రమాన్ని ఎలా ఆపారో కేంద్ర ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచిన పార్టీ, మోటార్లకు మీటర్లు బిగించిన పార్టీ బీజేపీ పార్టని అన్నారు. కటికదారిద్ర్యాన్ని అనుభవిస్తున్న దళితుల కోసం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని ఏ విధంగా ఆపారో సమాధానం చెప్పాలని, అన్ని వర్గాల ప్రజలకు వ్యతిరేఖంగా పని చేస్తున్న ఈటల రాజేందర్ కు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.

బీజేపీకి ఓటు వెయ్యడం అంటే ధరలు పెంచిన, మోటార్లకు మీటర్లు బిగించిన, దళిత వ్యతిరేఖ పార్టీకి ఓటు వేయ డమంటే దాన్ని సమర్థించినట్లేనని పేర్కొన్నారు.బీజేపీ మనిషి ఈటల రాజేందర్‌కు ఓటు వేయకుండా టీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి నరైన తీర్పు ఇవ్వాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమం, అభివద్ధే ధ్యేయంగా పని చేస్తున్న టీఆర్ ఎస్ పార్టీకి ఓటు వేసి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

దళితబంధు ఇవ్వడం చేతకాక.. బిజెపి పై బురదజల్లడం కేసీఆర్ కు అలవాటే..

–బిజెపి దళితమోర్చా జిల్లా అధ్యక్షులు సంటి మహేష్
–వేములవాడలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 19 (నేటినిజం ప్రతినిధి): ఇన్నాళ్లు దళిత బందు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన సిఎం కేసిఆర్ ఇప్పుడు దళిత బందు నిలిపి వేశారని భాజపాపై నెట్టుతున్నారని దీనికి నిరసనగా భారతీయజనతా పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సంటి మహేష్ ఆధ్వర్యంలో వేములవాడ లో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది.ఈ సందర్భంగా సంటి మహేష్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ దళిత బందును కేవలం ఎన్నికలు పూర్తయ్యే వరకు నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసిన సంగతి మీకు తెలియదా .అందుకు కారణం బిజెపి అని టిఆర్ఎస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు అనటం విడ్డూరంగా ఉందని.దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగిన ఎన్నికల కోడ్ వుంటుందని ఆ కోడ్ వున్నప్పుడు ఎలాంటి ఆర్థిక పరమైన మంజూరు చేయరాదని టిఆర్ఎస్ మంత్రులు ఎమ్మెల్యేలు తెలుసుకోవాలని ఎస్సీ మోర్చా అన్నారు.ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వానికి దళితుల పైన చిత్తశుద్ధి ఉంటే హుజురాబాద్ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ప్రతి దళిత కుటుంబానికి 10 లక్షల చొప్పున ఎందుకు ఇవ్వలేదు చెప్పాలన్నారు కొద్దిమంది అకౌంట్లో డబ్బులు వేసి ఆ అకౌంట్లను ఎందుకు స్తంభింప చేశారని కెసిఆర్ చెప్పాలన్నారు. కెసిఆర్ ప్రభుత్వం హుజురాబాద్ ఎన్నికల కోసమే దళిత బందు అనేపథకాన్నితీసుకువచ్చామని స్వయంగా కేసీఆర్ ఏ చెప్పాడుకాబట్టి హుజురాబాద్ లో దళితుల ఓట్లు ఎక్కువగా ఉన్నందున దళితులకు ఆశచూపి హుజురాబాద్ ఎన్నికల్లో గెలవాలనే ఆశతో ఈ పథకాన్ని తీసుకు వచ్చారని రాష్ట్ర ప్రజలకు తెలుసునని అన్నారు .అంతేగాని దళితులకు 10 లక్షలు ఇవ్వాలని లేదు అని అందుకే హడావుడిగా ఈ డ్రామాలు ఆడుతున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ బిజెపి జిల్లా అధికప్రతినిధి గోపు బాలరాజు బిజెపి పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోలా కృష్ణ స్వామి నాయకులు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి శ్రీనివాస్ గౌడ్ గడ్డమీది శ్రీనివాస్ తిరుమల్ రెడ్డి సుమంత్ రెడ్డి అన్నారం శ్రీనివాస్ జింక అనిల్ బిల్లా కృష్ణ గుడిసె మనోజ్ సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

వేములవాడలో మిలాదు ఉల్ నబీ ర్యాలీ ..

ఆత్మీయంగా ముబారక్ అంటూ ఆలింగనం చేసుకున్న ముస్లిం సోదరులు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 19 (నేటినిజం ప్రతినిధి):మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో తిప్పాపురం బస్టాండ్ నుండి అర్బన్ కాలిని మదీనా మజీద్ వరకు మర్కజీ మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మిలాద ఉల్ న్నబి భారీ ర్యాలీ నిర్వహించారు .. జామా మదీనా మస్జిద్ మౌలానాలు షమీ , న జీమ్ రజి మాట్లాడుతూ చీకట్లను చీల్చిన వెలుతురు సూర్యుడు..మానవ మహోపకారి మహమ్మ ద్ ప్రవక్త అని అన్నారు. ప్రవక్త జీవితం యావత్తు మానవజాతికి ఆదర్శమన్నారు. ఆయన మరణించి 1450 సంవత్సరాలు గడచినప్పటికి ప్రవక్త చెప్పిన మాటలు.. సజీవంగా ఉన్నాయని..ప్రవక్త ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. . ఈకార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ సర్వర్ అలీ బాబు న్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్ ముస్లిం యూత్ నాయకులు నవాజ్ ఖాన్ ఎం.ఎ.రఫీక్,అన్వర్, ఇబ్రహీం,ఎంఏ రాహిల్ ,బియాబాణి పర్వేజ్ , అఫ్సర్ ,నదీమ్ షరీఫ్ ,సోహెల్ లాల్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.ర్యాలీ సందర్భంగా టౌన్ సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు

జానారెడ్డినే ఓడించాం.. ఈటల అంతకన్నా పెద్ద లీడరా..? : కేటీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 19: నాగార్జున సాగర్‌లో జానా రెడ్డినే ఓడించాం. ఈటల రాజేందర్ అంతకన్నా పెద్ద లీడరా? అని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ చిట్ చాట్ చేశారు. ఈటల బీజేపీ బురదను అంటించుకున్నారు. బీజేపీని ఈటల, బీజేపీ ఈటల సొంతం చేసుకోవడం లేదు. జై ఈటల అంటున్నారు తప్ప జై శ్రీరామ్ అని ఎందుకు అనడం లేదు అని ప్రశ్నించారు. రాజేందర్ ఎందుకు రాజీనామా చేశారో ఇంత వరకు చెప్పడం లేదు. గెలిస్తే ఏం చేస్తాడో చెప్పకుండా.. వేరే విషయాలు మాట్లాడుతున్నారు. హుజూరాబాద్‌లో ఈటల, రేవంత్ కుమ్మక్కయ్యారు.

రేవంత్ చిలక జోస్యం చెప్పుకుంటే బెటర్

రేవంత్ రెడ్డి చిలక జోస్యం చెప్పుకుంటే బెటర్ అని కేటీఆర్ అన్నారు. హుజూరాబాద్‌లో కావాలనే కాంగ్రెస్ పార్టీ బలమైన అభ్యర్థిని బరిలోకి దింపలేదు. పీసీసీ అధ్యక్షుడు అయ్యాక.. ఇది తొలి ఉప ఎన్నిక. తనను తాను నిరూపించుకోవాలి కదా..? ఎందుకు హుజూరాబాద్‌కు వెళ్లడం లేదని రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్న సన్నాసి ఎందుకు రాజకీయ సన్యాసం తీసుకోలేదన్నారు.

సందర్భాన్ని బట్టి జాతీయ రాజకీయాల్లోకి కేసీఆర్

సమయం, సందర్భాన్ని బట్టి కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్‌కు ఉప రాష్ట్రపతి పదవి అనేది వాట్సాప్ యూనివర్సిటీ ప్రచారం అని పేర్కొన్నారు. తాను వేరే వారిలాగా చిలుక జోస్యం చెప్పలేను అని అన్నారు. తాను హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచారానికి వెళ్లడం లేదు. నాగార్జున సాగర్, దుబ్బాక ఉప ఎన్నిక ప్రచారానికి కూడా వెళ్లలేదు. హుజూరాబాద్‌లో సీఎం కేసీఆర్ ప్రచారం షెడ్యూల్ ఖరారు కాలేదన్నారు.

నవంబర్ 15 తర్వాత తమిళనాడుకు వెళ్తాం

నవంబర్ 15 తర్వాత తమిళనాడుకు వెళ్తామని కేటీఆర్ తెలిపారు. డీఎంకే, అన్నాడీఎంకే నిర్మాణాన్ని అధ్యయనం చేస్తామన్నారు. నీట్ రద్దుపై స్టాలిన్‌తో 100 శాతం ఏకీభవించలేం. తెలంగాణ విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదువుతున్నారు. రాష్ట్ర విద్యార్థులకు ఏది మేలైతే.. ఆ నిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

రేవంత్ రెడ్డికి దమ్ముంటే డిపాజిట్ తెచ్చుకోవాలి.. కేటీఆర్ సవాల్

హైదరాబాద్ , అక్టోబర్ 19: తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఉదయం జర్నలిస్టులతో కేటీఆర్ చిట్ చాట్ చేశారు. హుజూరాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా గెలుస్తుందన్నారు. హుజూరాబాద్‌లో బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయి.

ఈటల కోసం కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థిని నిలబెట్టిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే హుజూరాబాద్‌లో డిపాజిట్ తెచ్చుకోవాలని కేటీఆర్ సవాల్ చేశారు. కొంతకాలం తర్వాత ఈటలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తారు. మాజీ ఎంపీ వివేక్ కూడా కాంగ్రెస్‌లోకి వెళ్తారని వినిపిస్తోంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికి దిక్సూచిగా మారాయి.

కేసీఆర్ విజనరీ నేత.. మిగతా పార్టీల నేతలు టెలివిజనరీలు. రేవంత్ రెడ్డి చిలకజోస్యం చెప్పుకుంటే మంచిది. కాంగ్రెస్ పార్టీలో భట్టి విక్రమార్క ఒక్కరే మంచి వ్యక్తి. కానీ కాంగ్రెస్‌లో భట్టిది నడవట్లేదు.. గట్టి అక్రమార్కులదే నడుస్తోంది అని కేటీఆర్ అన్నారు.

టీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవికి కేసీఆర్‌ను ప్రతిపాదిస్తూ 10 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

ద్విదశాబ్ది వేడుకకు సన్నాహకాలు జరుగుతున్నాయి. విజయగర్జన సభకు భారీగా ఆర్టీసీ బస్సులు తీసుకుంటాం. నవంబర్ 15న ప్రజలు ప్రయాణాలు పెట్టుకోవద్దు అని విజ్ఞప్తి చేస్తున్నాను. 20 రోజుల్లో కొవిడ్ వ్యాక్సినేషన్ 100 శాతం పూర్తవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు.

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు

కరీంనగర్ అక్టోబర్ 19:(నేటినిజం ప్రతినిధి): మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మంగళవారంనాడు కరీంనగర్ కమీషనరేట్‌వ్యాప్తంగా పటిష్ట బందోబస్తును పోలీస్‌శాఖ ఏర్పాటు చేసింది. కరీంనగర్‌లో ముస్లిం సోదరులు నిర్వహించిన ఊరేగింపునకు పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ ఖార్జానాగడ్డ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తును పోలీస్ కమీషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏసిపిలు తుల శ్రీనివాసరావు, మదన్‌లాల్, కె శ్రీనివాస్‌లతోపాటుగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ చమురు, గ్యాస్ రంగ సిఇఒల తోను, నిపుణులతోను మాట్లాడనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 19:ప్రపంచ చమురు మరియు గ్యాస్ రంగ ముఖ్య కార్యనిర్వహణ అధికారుల (సిఇఒల) తోను, ఆ రంగానికి చెందిన నిపుణుల తోను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 అక్టోబర్ 20న సాయంత్రం 6 గంటల కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా సమావేశం కానున్నారు. ఇది ప్రతి ఏటా జరిగే సమావేశమే. ఈ సమావేశం 2016వ సంవత్సరం లో మొదలై, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జరుగుతూ వస్తోంది. అంటే ఈసారి జరిగే సమావేశం ఇటువంటి ఆరో సమావేశం అన్న మాట. ఇది చమురు, గ్యాస్ రంగం లో ప్రపంచ స్థాయి లో అగ్రగామి దేశాల భాగస్వామ్యానికి ప్రతీక గా ఉంది. ఈ అగ్రగామి దేశాలు చమురు మరియు గ్యాస్ రంగానికి సంబంధించిన కీలక అంశాల పై ఆలోచనలను వ్యక్తం చేయడమే కాక భారతదేశం తో సహకారం తో పాటు పెట్టుబడి కి అవకాశాలు ఉన్న రంగాల ను గురించి కూడా తెలుసుకోవడం జరుగుతుంది.

స్వచ్ఛమైన అభివృద్ధికి మరియు స్థిరత్వానికి ప్రోత్సాహాన్ని అందించడం అనేది ఈ సంభాషణ తాలూకు ముఖ్య విషయం గా ఉంటుంది. భారతదేశం లో హైడ్రోజన్ రంగం లో అన్వేషణ ను మరియు ఉత్పాదన ను పెంపొందించడం, శక్తి స్వాతంత్ర్యం సముపార్జన, గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ ను రూపొందించడం, ఉద్గారాల ను తగ్గించుకొంటూ ఉండడం, హరిత హైడ్రోజన్ ప్రధానమైన ఆర్థిక వ్యవస్థ, బయోఫ్యూయల్స్ ఉత్పత్తి ని పెంచుకోవడం తో పాటు చెత్త నుంచి సంపద ను సృష్టించడం వంటి రంగాల పైన ఈ మాటామంతీ కార్యక్రమం లో దృష్టి ని కేంద్రీకరించడం జరుగుతుంది. ఈ ఆలోచన ఆదాన ప్రదానం లో ప్రముఖ బహుళజాతీయ సంస్థలకు మరియు అంతర్జాతీయ సంస్థలకు చెందిన సిఇఒ లు, నిపుణులు పాలుపంచుకోనున్నారు.

ప్రవక్త ముహమ్మద్ జన్మదిన సందర్భంగా అన్నదానం

సమాజ సేవ చేయుటకు ముందుకు రావాలి– జుబైర్ అహ్మద్

కరీంనగర్ అక్టోబర్ 19:(నేటినిజం ప్రతినిధి): జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ తూర్పు శాఖ ఆధ్వర్యంలో ప్రవక్త ముహమ్మద్ వారి జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ తూర్పు శాఖ సమాజ సేవ విభాగం తరపున నగరంలో పేదప్రజలలో ,వృద్ధులు ,అనాధలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జమాతే ఇస్లామీ సమాజ సేవ లో భాగంగా 500 ప్యాకెట్లను ఉచితంగా సరఫరా చేయడం జరిగింది. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు జుబైర్ అహ్మద్ మాట్లాడుతూ మహా ప్రవక్త ముహమ్మద్(స) వారు ఆ దేవుని తరపున సమస్త మానవాళి కి సన్మార్గాన్ని చూపించడానికి పంపించబడ్డ ప్రవక్తలలో చిట్టచివరి ప్రవక్త అని , మహా ప్రవక్త ముహమ్మద్ (స) కేవలం ముస్లింల ప్రవక్త కాదని ,సమస్త మానవుల కొరకు పంపించబడ్డారని తెలిపారు, అదే విధంగా ప్రస్తుత సమాజం వివిధ సమస్యలలో కూరుకొని పోయిందని , మానవుల సంబంధాలు రోజురోజుకు క్షిణిస్తున్నాయని,సమాజంలో పెరిగిపోతున్న చెడులను నిర్మూలించడానికి కృషి చేయాల్సిన అవసరం ఏంటో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సమాజ సేవ విభాగ బాధ్యులు మహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ ప్రవక్త వారి బోధనల ద్వారానే ఒక కొత్త శ్రేష్టమైన సమాజాన్ని ఏర్పాటు చేయడం సాధ్యమని అందుకే సమస్త ప్రజలు కుల మత బేధం లేకుండా మహా ప్రవక్త (స) ముహమ్మద్ వారి జీవితాన్ని,వారి బోధనలను అధ్యయనం చేయాలనీ విజ్ఞప్తి చేసారు. జమాతే ఇస్లామీ గత 70 సంవత్సరాలుగా సమాజ సేవ కార్యక్రమాలనుచేపట్టుతుందని, ఇందులో భాగంగా రక్తదాన శిబిరాలు, ఉచిత విద్య శిబిరాలు,పేద ప్రజలకు నిత్యావసరాల పంపిణి, పేద విద్యార్థులకు స్కాలర్షిప్,వితంతువులకు,వికలాంగులకు పెన్షన్, వడ్డీరహిత రుణాలు మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది తెలియ చేసారు.ప్రతి భారత పౌరుని పై తమ తోటి నివసించే వారి పట్ల సామజిక బాధ్యత ఉన్నదని , అందుకే ప్రతి పౌరుడు తనకు వీలైనంతగా సమాజ సేవ చేయడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేసారు.

ఈ కార్యక్రమంలో నయూముద్దీన్,అక్రమ్,,జుబైర్,అమీర్ఖాన్,తారిఖ్,ఒవేస్ ,షకీల్ తదితరులు పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.